క్లుప్తంగా

రుణాలు రెన్యువల్ చేసుకోవాలి

రేగిడి : రేగిడి ఆమదాలవలస సొసైటీ పరిధిలో ఉన్న రైతులు రుణాలను రెన్యువల్ చేసుకోవాలని పీఏసీఎస్ చైర్‌పర్సన్ నెల్లి పెంటన్నాయుడు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫిబ్రవరి నెలాఖరు లోగా నాలుగు శాతం వడ్డీ చెల్లించి రుణాలను రెన్యువల్ చేయించుకోవాలని వెల్లడించారు. గడువులోగా రుణాలు రెన్యువల్ చేయించుకోకపోతే 13 శాతం వడ్డీతో పాటు అసలు కూడా చెల్లించాల్సి ఉంటుందన్నారు. రెన్యువల్ చేయించుకునేందుకు ఆధార్, 1బీ, మొబైల్ నంబర్ తదితర వాటిని సొసైటీకి అందజేయాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



ఆకులకట్టలో ఎవెన్యు ప్లాంటేషన్ మొక్కలను పరిశీలిస్తున్న ఎన్ఎల్ఎం బృందం

బాడంగి: నేషనల్ లెవెల్ మోనటరింగ్ కేంద్ర బృందం మండలంలో బుధవారం పర్యటించింది. ఈ బృందం ఆకులకట్ట, పూడివలస గ్రామాలలో ఉపాధి హామీ నిధుల ద్వారా చేపట్టిన పనులను తనిఖీ చేసింది. తొలిత ఆకులకట్టలలో రైతుల భూములలో చేపట్టిన మొక్కల పెంకం, కొండ ప్రాంతంలో గల పొలాల్లో చేపట్టిన బౌండ్రీ కంతకాలు, ఎవెన్యూ ప్లాంటేషన్ పేరుతో రోడ్డు ప్రక్కన నాటిన మొక్కలను పరిశీలించారు. చూసిన మేరకు పనులు భేష్‌గా ఉన్నాయని కితాబునిచ్చారు. బృందంలో ఎన్ఎల్ఎం బృంద మోనటరీస్ గిరిజా శంకర్‌పాడి, సత్యరంజన్ రౌత్, డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి, ఏపీడీ రాధ, ఎంపీడీఓ అక్కారావు, ఏపీఓలు లక్ష్మీపతిరాజు, విజయలక్ష్మి, కన్వర్జేన్సీ శాఖలకు చెందిన అధికారులు, ఈసీ బుజ్జి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

చిత్రకారుడికి అభినందన



రామకృష్ణను అభినందిస్తున్న బేబీనాయన

బొబ్బిలి: అమలాపురం కోనసీమ చిత్ర కళాపరిషత్‌లో ఈ నెల 22న జరిగిన 32వ అంతర్జాతీయ చిత్ర కళాప్రదర్శనలో బొబ్బిలికి చెందిన కాదూరి రామకృష్ణ బంగారు పతకం సాధించడంతో బుధవారం ఆర్వీఎస్‌కెకె.రంగారావు (బేబీనాయన) అభినందించారు. ఈ ప్రాంతానికి చెందిన చిత్రకారుడు రాష్ట్ర స్థాయిలో విజేత కావడం మన ప్రాంతానికి గర్వకారణమని అన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



వేతనదారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ భాస్కరరావు

బొబ్బిలి రూరల్: మండలంలోని రంగరాయపురం, రాజచెరువువలస గ్రామాలలో ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీఓ అల్లు భాస్కరరావు, ఏపీఓ జనార్ధనరావు బుధవారం పరిశీలించారు. వేతనదారుల మస్తర్లు పరిశీలించిన ఎంపీడీఓ వేతనదారులకు, మేట్లుకు పలు సూచనలు చేశారు. పనిలోకి వచ్చిన వారికి, పని ప్రదేశంలో ఉన్నవారికి మాత్రమే మస్తర్లు వేయాలని మేట్లుకు, ఫీల్డు అసిస్టెంట్లకు సూచించారు. వేతనదారులంతా పని ప్రదేశంలో ఉండాలని, సమయపాలన పాటించాలని సూచించారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

వంగర: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ వై.దుర్గారావు బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాప్రమాణాలు మెరుగుపడాలని సూచించారు. జగనన్న గోరుముద్ద పథకం అమలు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు.

సీఐ జైభీమ్‌కు సన్మానం



జైభీమ్‌ను సత్కరిస్తున్న రోటరీ ప్రతినిధులు

బొబ్బిలి రూరల్: హెల్త్‌కేర్ ఇంటర్నేషనల్, హైదరాబాద్ సంస్థతో ప్రతిష్టాత్మక జాతీయ సమైక్యతా అవార్డు అందుకున్న బొబ్బిలి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్‌ను ఎస్ఈబీ కార్యాలయంలో బుధవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేడుకగా ఓటరు దినోత్సవం



బొబ్బిలి రూరల్: సూచనలిస్తున్న ఆర్డీఓ పి.శేషశైలజ



తెర్లాం: సీనియర్ మహిళా ఓటర్లను సన్మానిస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి తదితరులు



రేగిడి: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో 'నేను తప్పక ఓటు వేస్తాను' అని ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్ఓ, తహశీల్దార్



బొబ్బిలి రూరల్: ఓటర్లను చైతన్యపరుస్తూ ఏర్పాటు చేసిన మానవహారం



బొబ్బిలి రూరల్: ఆకర్షణీయంగా వేసిన రంగవల్లులు

ప్రజాస్వామ్యంలో ఓటు విలువ చాలా ప్రాముఖ్యమైనదని దీన్ని అంతా గుర్తించాలని ఆర్డీఓ పి.శేషశైలజతో పాటు పలువురు వక్తలు అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బుధవారం ఓటరు చైతన్య ర్యాలీలు, మానవహారాలు, పోటీలు, అవగాహన సదస్సులు తదితరమైనవి నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో యువత, అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



సంతకవిటి: ఓటర్ల దినోత్సవం సందర్భంగా మానవహారం



తెర్లాం: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న అధికారులు



రాజాం సిటీ: విద్యార్థుల అవగాహనా ర్యాలీ



బాడంగి: ర్యాలీ చేస్తున్న గురుకుల విద్యార్థులు



వంగర: ఓటరు దినోత్సవ మానవహారం



రామభద్రపురం: ఓటరు సెల్లార్ ప్రారంభిస్తున్న తహసీల్దార్

ఇంటికే సంక్షేమ ఫలాలు

- అర్హతే ప్రామాణికం
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి



18వ వార్డులో లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు వివరిస్తూ బుక్‌లెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి రూరల్: లబ్ధిదారుల ఇంటికే నేరుగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించే ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు అన్నారు. పట్టణంలో 18వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి అందుతున్న పథకాలు వివరించి, బుక్‌లెట్లు అందించి ఆ మేరకు పథకాలు అందినదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తమకు సంక్షేమ ఫలాలు అందాయని, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది నేరుగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో జన్మభూమి కమిటీల పేరిట టీడీపీ నాయకులు చేసిన అరాచకాలు అందరికీ తెలుసని, జగన్ వలంటీర్ల ద్వారా సేవలు అందిస్తున్నారని, ప్రజలకు స్థానికంగా సేవలు అందించాలనే లక్ష్యంతో సచివాలయాలు ఏర్పాటు చేశారని తెలిపారు. అజెండా లేని ప్రతిపక్షాలు, ఆరోపణలు చేసి బురదచల్లే ఎల్లో మీడియా మాటలు ప్రజలు నమ్మొద్దని, రాబోయే ఎన్నికలలో ప్రజలంతా జగన్ పనితీరు చూసి ఓటేయాలని కోరారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు మురళీకృష్ణ, మాజీ చైర్మన్ ఇంటి గోపాలరావు, వైస్ చైర్‌పర్సన్లు గొలగాన రమాదేవి, చెలికాని మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావులతో పాటు పలువురు కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం



లింగాలవలసలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అందిస్తోందని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని లింగాలవలస గ్రామంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిన్న చిన్న సమస్యలను అక్కడే ఉన్న అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే వెంటనే గ్రామ సచివాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, సర్పంచ్ గొరజాన అప్పలనాయుడు, ఎంపీటీసీ రెడ్డి నర్సింగరావు, పోలినాటి వెలమ రాష్ట్ర డైరెక్టర్ కింజరాపు పద్మావతీ సురేష్, డాక్టర్ ఉకలాపు సత్యారావు, ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు, తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి, జేసీఎస్ కన్వీనర్ పాలవలస రామచంద్రినాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు'

- అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం



అంబేడ్కర్ విగ్రహానికి పాదాభివందనం చేస్తున్న మంత్రి రాజన్నదొర

మెంటాడ: సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తుందని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని పెదచామలాపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సంక్షేమానికి చిరునామాగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుందన్నారు. జగనన్న పేదల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా భావించి నవరత్నాలతో పాటు పలు పథకాలను అమలు చేస్తున్నారన్నారు. పేదల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ

అంబేడ్కర్ ఎంతో మందికి ఆదర్శప్రాయుడని, ఆయన రాసిన రాజ్యాంగం వల్లే నేడు ఎంతో మంది దళిత, గిరిజన కుటుంబాల్లో ఉన్నవారు ఉన్నత స్థాయిలో అందలాలు ఎక్కారన్నారు. పెదచామాలాపల్లి గ్రామంలోని గడప గడపకు కార్యక్రమంలో ముందుగా అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం పూలమాల వేసి పాదాలకు అభివందనం చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ రోజు తాను ఉప ముఖ్యమంత్రి అయ్యానంటే దానికి గల కారణం అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంలో దళితులకు ఇచ్చిన ప్రాధాన్యత వల్లేనన్నారు. గ్రామ సర్పంచ్ భాయి తవుడుమ్మ, స్థానిక నాయకులు భాయి అప్పారావు, జిల్లా దళిత నాయకులు బసవ సూర్యనారాయణ, మండల పార్టీ నాయకులు లెంక రత్నాకర్, వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు, పొట్టంగి అచ్చుత్, రెడ్డి రాజప్పలనాయుడు, చెల్లూరి లక్ష్మణరావు, కిలపర్తి మధు, మోహన్, ఎంపీడీఓ తివిక్రమ్, తహసీల్దార్ ఆదిబాబుతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఓ ప్లాంట్లు మంజూరు

వంగర: మండల పరిధి మద్దువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రెండు ఆర్‌ఓ ప్లాంట్లు మంజూరైనట్లు ప్రిన్సిపాల్ కొరటాన నారాయణరావు బుధవారం తెలిపారు. ఒక్కొక్క ప్లాంటు రూ.4.63 లక్షలు విలువ చేస్తుందని, వీటిని బాలురకు, బాలికలకు వేర్వేరుగా స్వచ్ఛమైన తాగునీటి కోసం ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

యోగా గురువుకు సత్కారం



రమణమూర్తికి సత్కారం

రాజాం: రాజాంకు చెందిన వికాస తరంగిణి స్టేట్ సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ, యోగా గురువు టీటీవీ రమణమూర్తిని బుధవారం ఘనంగా సత్కరించారు. రాజాంలో వికాస తరంగిణి సభ్యులు ఈ కార్యక్రమం చేపట్టారు. బైరిసారంగపురం జెడ్పీ హైస్కూల్‌లో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన రమణమూర్తిని సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, ప్రజ్ఞ వికాస్, సంస్కార్ వికాస్, యువ వికాస్, ఆరోగ్య వికాస్ కార్యక్రమాల సభ్యులు, వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు.

వేతనదారుల సంఖ్య పెంచాలి



సమావేశంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీపీ, ఎంపీడీఓ

తెర్లాం: మండలంలోని అన్ని గ్రామాల్లో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో రోజువారీ వేతనదారుల సంఖ్య పెంచాలని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి అధికారులు, క్షేత్ర, సాంకేతిక సహాయకులతో సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, ఎంపీడీఓ పంచాయతీల వారీగా సమీక్ష నిర్వహిస్తూ ఏయే గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయి, ఎంతమంది వేతనదారులు రోజువారీగా పనులకు హాజరవుతున్నారని క్షేత్ర, సాంకేతిక సహాయకులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఉపాధి పని కావాలని కోరిన ప్రతీ వేతనదారునికి పని కల్పించాలని తెలిపారు. వేతనదారులకు రోజువారీ వేతనం రూ.257లు గిట్టుబాటు అయ్యేలా రెండు పూటలా పనులు చేయించాలని కోరారు. సమావేశంలో ఉపాధి ఏపీఓ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లి కాలువల్లో ఉపాధి పనులు



బూరాడ వద్ద తోటపల్లి కాలువలో ఉపాధి పనులు చేయిస్తున్న ఏపీఓ

రేగిడి : మండలంలోని బూరాడ గ్రామ సమీపంలో ఉన్న తోటపల్లి కాలువల్లో బుధవారం ఉపాధి పనులు ప్రారంభించారు. ఏపీఓ ఎస్.హరనాథ్ దగ్గరుండి కాలువల్లో పనులు చేయించారు. పంట పొలాలకు సాగునీరు అందించేందుకు ఈ కాలువలు ఎంతగానో ఉపయోగపడతాయని, వేతనదారులు చక్కగా ఉపాధి పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటరమణ, మేట్లు పాల్గొన్నారు.

పాతాళభైరవి ట్రైలర్ విడుదల



సినిమా ట్రైలర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: స్థానిక తృప్తి రిసార్ట్‌లో బుధవారం పాతాళభైరవి కొత్తసినిమా ట్రైలర్‌ను ఎమ్మెల్యే కంబాల జోగులు ఆవిష్కరించారు. రాజాం పరిసర ప్రాంతాల్లో సినిమా షూటింగ్ జరిగిందని ఆయన వెల్లడించారు. స్థానికంగా ఉన్న కొంతమంది నటులకు కూడా ఈ సినిమాలో అవకాశం వచ్చిందని పేర్కొన్నారు. సినిమా ఫిబ్రవరి 3న రాజాంలోని ఓ థియేటర్‌లో విడుదల చేయనున్నట్లు తెలిపారు. శ్రీకర్‌బాబు ఈ సినిమాకు దర్శకత్వం వహించగా అరుణాచల శివ బ్యానర్‌పై నిర్మాణం జరిగిందని వెల్లడించారు. దగ్గుబాటి వరుణ్, సీహెచ్‌వీ అనంత్, కల్యాణ భాషిణి, పీవీజీకే రాజులు ప్రొడ్యూసర్లుగా వ్యవహరించారని వెల్లడించారు. బంకుపల్ల భరద్వాజ్, బింధుభైరవి, రాధాకృష్ణ తదితర తారాగణం నటించారని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు సినిమా తారాగణం, స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు పాలవలస శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు, లావేటి రాజగోపాలనాయుడు పాల్గొన్నారు.

నైరెడ్‌లో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న దాతలు

రాజాం: రాజాంలోని జీఎంఆర్ నైరెడ్ శిక్షణలో రక్తదాన శిబిరం బుధవారం నిర్వహించారు. నైరెడ్ వార్షికోత్సవం సందర్భంగా ఈ శిబిరం నిర్వహించినట్లు డైరెక్టర్ కె.శశిధర్ తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగిందని, 30 మంది యువతీ యువకులు రక్తదానం చేశారని వెల్లడించారు. రాజాం రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్‌కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్, పీఓ నాగరాజు, రాంబాబు, నాగేశ్వరరావు, వినయ్‌కుమార్, పుష్పారాజ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

మెరుగైన వైద్య సేవలు

వంగర: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యమని వైద్యాధికారిణి జ్యోతి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధి కొత్తమరువాడ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పలువురు రోగులకు తనిఖీలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది వాసవి, రమణమ్మ, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

రాజాం సిటీ: ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలని ఈఓపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు సూచించారు. మండల పరిధి పెనుబాక గ్రామంలో ప్లాస్టిక్ నిషేధంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పాన్‌షాపులు, కిరాణా దుకాణాల వద్దకు వెళ్లి ఈ నెల 26 నుంచి ప్లాస్టిక్ నిషేదం అమలులోకి వస్తుందని అన్నారు. ఈ నిషేధానికి ప్రజలతో పాటు దుకాణ యజమానులు కూడా సహకరించాలని తెలిపారు. గ్రామాల్లో ఎవరూ పట్టించుకోరని మొండికేసి పట్టుబడితే రూ.20 వేలు అపరాద రుసుం విధించడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు కూడా టిఫిన్స్, ఇతర సరుకులకు వెళ్లేటప్పుడు బాక్స్‌లు, గుడ్డ సంచులు తీసుకుని వెళ్లాలని సూచించారు. ప్రతి నిత్యం సచివాలయ సిబ్బంది పర్యవేక్షణ చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండి బోడెమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల ఔదార్యం



ఇంద్రజ తల్లిదండ్రులకు నగదును అందజేస్తున్న వైస్ ఎంపీపీ, ఎంపీడీఓ, సచివాలయాల ఉద్యోగులు

రేగిడి : మండలంలోని గ్రామ సచివాలయాల ఉద్యోగులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. మండల పరిధిలోని చిన్నశిర్లాం గ్రామానికి చెందిన మీసాల అప్పలనాయుడు, కృష్ణవేణి దంపతుల కుమార్తె ఇంద్రజ వింత వ్యాధితో బాధపడుతున్నారు. తల రోజు రోజుకు పెద్దదిగా అవుతుండడంతో ఆర్థిక పరిస్థితి బాగోలేక ఇంద్రజకు వైద్యం అందించలేని పరిస్థితి నెలకొంది. మండలంలోని సచివాలయాల ఉద్యోగులంతా రూ.50వేలు సమకూర్చుకొని బుధవారం వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, సర్పంచ్ టంకాల ఉమాపాపినాయుడు, ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావుల చేతుల మీదుగా ఇంద్రజ తల్లిదండ్రులకు అందజేశారు.

భరతమాతకు పూజలు

బొబ్బిలి రూరల్: మండలంలోని రాజచెరువువలస గిరిజన గ్రామంలో సమరసతాసేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం భరతమాతకు పూజలు నిర్వహించారు. సమరసతా సేవా ఫౌండేషన్ డివిజన్ కార్యదర్శి ధూపం వాసు మాట్లాడుతూ మన భారతావనికి ఆదిదైవం భరతమాత అని, దేశానికి తల్లి అని విద్యార్థులంతా భరతమాతకు పూజించి, దేశభక్తి పెంపొందించుకోవాలని సూచించారు. బాల వికాస కేంద్రం మాతాజీ మొయ్యి నిర్మల, దేవాలయ అర్చకులు మొయ్యి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన

బొబ్బిలి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణ ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు బుధవారం ధర్నా చేశారు. 26వేల రూపాయలు వేతనం ఇవ్వాలని, అంగన్‌వాడీలకు ఫేషియల్ యాప్ రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అంగన్‌వాడీలకు ఇవ్వాలని తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం సీడీపీఓ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.శంకరరావు, అంగన్‌వాడీ సంఘ నాయకులు పాల్గొన్నారు.